క్లుప్తంగా

నేటి నుంచి కానూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పెనమలూరు: కానూరులో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నారు. గ్రామంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు తాడిగడప మున్సిపాలటీ ఐదో సచివాలయం పరిధి మురళీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఇతర అధికారులు పాల్గొననున్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు

పెనమలూరు: తాడిగడపలో బాలిక అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసనగర్‌కు చెందిన పిల్లి శివలక్ష్మి పటమటలంక పాఠశాలలో పని చేస్తున్నారు. ఆమె భర్త నాగేంద్ర కూలి పనులు చేస్తాడు. ఆమె కుమార్తె (17) చదువుమాని ఇంట్లో ఉంటోంది. శివలక్ష్మి కుమార్తె శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఘటనపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసరాల పంపిణీ

పెనమలూరు: వణుకూరులో పేద కుటుంబానికి ఆదివారం సరుకులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు, ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో వణుకూరు గ్రామంలో భాగ్యలక్ష్మికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు, కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామస్తులు సుంకర రాజా, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



గన్నవరం: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలని మత్స్యకార సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలోని మత్స్యకార సహకార సంఘం భవనం ఆవరణలో ఆదివారం సంఘ సభ్యులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. సురేష్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో సమస్త జీవకోటి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. దీన్ని అధిగమించడానికి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు నిడమర్తి రామారావు, కార్యదర్శి జ్యోతి రంగారావు, డైరెక్టర్లు తిరివీధి ఆశీర్వాదం, మునేష్, మోటుపల్లి సుబ్బారావు, రంగారావు, శ్రీనివాసరావు, భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లిలో ఆదివారం పైప్‌లైన్‌ల మరమ్మతులను పంచాయతీ ఆధ్వర్యాన నిర్వహించారు. గ్రామంలో పైప్‌లైన్ లీకేజీ గుర్తించి సిబ్బందితో తవ్వించి పనులను సర్పంచ్ కొలుసు శిరీష పూర్తి చేయించారు.

అట్రాసిటీ కేసులు నమోదు చేయండి: అన్నవరపు

గన్నవరం: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో మనుస్మృతి ప్రాచీన రాజ్యాంగం శిక్షాస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని దళిత బహుజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ పి. కనకరావును కలిసిన నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఏ విజయకుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం ఆ భగవంతునికి సేవ చేయడంతో సమానమని క్లో లలితా మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు క్లో సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్ నగర్ రైతుబజార్ వద్ద ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో హరీష్ పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం

విజయవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధాన కార్యక్రమం జరిగింది. బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద 6బి ఫారమ్‌లో ఆధార్ అనుసంధానం చేశారని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. రూరల్ మండలంలో 77 పోలింగ్ కేంద్రాల్లో వంద మంది ఓటర్లు ఆధార్‌ను అనుసంధానం చేశారని చెప్పారు.

ప్రభోత్సవానికి వేగంగా ఏర్పాట్లు



ప్రసంగిస్తున్న డీఎస్పీ విజయ్‌పాల్



గ్రామంలో మండపం వద్ద దేవుడి ప్రభను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దేవుడి ప్రభ ఏర్పాటుకు గ్రామస్తులు రంగం సిద్ధం చేస్తున్నారు. గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి పండుగ 18వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా పండుగ నాడు గ్రామంలో భారీ ఎత్తున ప్రభోత్సవం చేయనున్నారు. గ్రామంలో దేవుడి ప్రభ ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మొత్తం 50 ప్రభలు కొండ చుట్టూ ప్రదర్శిస్తారు. దేవుడి ప్రభకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తారు. దేవుడి ప్రభ రాతి చక్రాల పై ఏర్పాటు చేస్తారు. తెలంగాణ నుంచి వెదురు కర్రలు తీసుకు వచ్చారు. గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి దేవుడి ప్రభ సిద్ధం చేయడానికి పనులు ప్రారంభించారు. పండుగ రోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రభోత్సవం ఉంటుంది. ప్రభ ప్రతిష్ఠ 18వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుంది.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవం నిర్వహించండి

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి వేడుకల్లో ప్రభోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఎస్పీ విజయ్‌పాల్ అన్నారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఆదివారం గ్రామస్తులు, ప్రభ నిర్వాహకులకు ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 18వ తేదీన జరిగే ప్రభోత్సవంలో 34 ప్రభలకు అనుమతించామన్నారు. ప్రతీ ప్రభకు నిర్వాహకులు ఐదుగురు చొప్పున బాధ్యత వహించాలన్నారు. దేవాలయ అధికారులు ఇచ్చిన సీరియల్ ప్రకారమే ప్రభలు కొండ చుట్టూ ప్రదక్షిణ చేయించాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహాశివరాత్రి విజయవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ ఆర్.గోవిందరాజు, ఆలయ ఈవో గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్, ప్రభ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'ఈడుపుగల్లు' స్విమ్మర్లు



పతకాలు సాధించిన ఈడుపుగల్లు ఈతకొలను స్విమ్మర్లు

కంకిపాడు: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈడుపుగల్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈతకొలనులో నిర్వహించిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్ స్విమ్మర్లు పతకాలు సాధించారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్‌లో 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు, క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. పోటీల్లో అండర్–17 విభాగంలో ఈడుపుగల్లుకు చెందిన బిళ్లా హర్షిత 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో బంగారు పతకం, కె.వర్షంత్ నాయుడు 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. అండర్–14 విభాగంలో బిళ్లా హర్షశ్రీ 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం, 100 మీటర్ల బటర్ ఫ్లైలో బంగారు పతకం పొందారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి అభినందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



రోగులతో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం రమేష్ హాస్పిటల్స్, ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమతో పాటు మంచి ఆహార అలవాట్లను, క్రమబద్ధమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. హైస్కూల్ విద్యలో ఆరోగ్య సమస్యలు, చిన్న చిన్న వైద్య పరిష్కారాలను బోధన సబ్జెక్టుగా చేర్చాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. సుమారు 420మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి, శరత్‌బాబు, ప్రముఖ కార్డియాలజిస్ట్ రమేష్ బాబు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్రకారులను ప్రోత్సహించేలా పోటీలు నిర్వహించి బహుమతులందించడం అభినందనీయమని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(హైదరాబాద్) రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో క్రియేటివ్ హార్ట్స్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మాస్టర్ స్ట్రోక్– పేరిట చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన 45 మంది చిత్రకారులు ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుందర్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో చిత్రకళ అభివృద్ధికి క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. సీనియర్ చిత్రకారుడు డి.శివప్రసాద్ మాట్లాడుతూ చిత్రకళ అనేది ప్రతి మనిషిలో ఉన్న అంతర్గత, మానసిక పరిస్థితిని ప్రతిబింబించే గొప్ప సాధనమన్నారు. ఇది మనిషికి ఎంతో ఆనందాన్ని, ఆలోచనలను కలిగిస్తాయన్నారు. చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసి చిత్రకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు అంజి ఆకొండిని అభినందించారు. ఏపీ దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కె.శైలజ భరత్ మాట్లాడుతూ చిత్రకళ దేవుడిచ్చిన వరమన్నారు. చిత్రకళా ప్రదర్శన కోసం అమలాపురంలో గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలపారు. క్రియేటివ్ హార్ట్స్ వ్యవస్థాపకుడు అంజి ఆకొండి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఎంతోమంది చిన్నారులకు, చిత్రకారులకు వివిధ చత్రకళ పోటీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ చిత్రకళ అభివృద్ధికి, చిత్రకారుల గుర్తింపు కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. తెలుగు అండ్ సంస్కృతం అకాడమీ మెంబర్ డాక్టర్ కె.రామకృష్ణ, 64 కళలు ఎడిటర్ వై.కళాసాగర్ మాట్లాడారు.

కూచిపూడి నృత్యంలో శ్రుతి సమన్వి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం కల్చరల్, డిఫెన్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వందేభారతం నృత్య ఉత్సవ్–2023లో నగరానికి చెందిన కె.శ్రుతి సమన్వి సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది చదువుతున్న శ్రుతి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కూచిపూడి నృత్యం విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు శ్రుతి సమన్వికి అభినందనలు తెలిపారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందనలో పాల్గొనే అధికారులకు దరఖాస్తుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మన ఇంటి నుంచే భద్రతా చర్యలు



ఐజీఎం స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఏసీపీ ఖాదర్‌బాషా

ఏసీపీ ఖాదర్ బాషా

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు పాటించడం మన ఇంటి నుంచే ప్రారంభిద్దాం.. సమాజానికి ఆదర్శంగా నిలుద్దామని సెంట్రల్ ఏసీపీ ఖాదర్ బాషా పేర్కొన్నారు. అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ డేను పురస్కరించుకుని అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ర్యాలీని ఏసీపీ ఖాదర్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్‌షేక్ అధ్యక్షతన జరిగిన సభలో ఏసీపీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వైద్యుల ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి నుంచే జాగ్రత్తలు పాటించాలని, అప్పుడే మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాలను అరికట్టగలుగుతామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్టు ధరించడం తమ బాధ్యతగా భావించాలని తెలిపారు. అలా చేస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం లేకుండా బయటపడవచ్చన్నారు. అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలతో యువకులు చిన్న వయస్సులోనే తలకు, ముఖాలకు గాయాలై జీవచ్ఛవాలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి, వారి కుటుంబానికే నష్టం కాకుండా యావత్ దేశానికి నష్టమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఐజీఎం స్టేడియం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎంజీ రోడ్డులో హోటల్ డీవీ మానర్, అక్కడి నుంచి టిక్కిల్ రోడ్డులో నుంచి సిద్ధార్థ ఆడిటోరియం వరకూ కొనసాగింది. ఈ ర్యాలీలో 200 మందికిపైగా వైద్యులు, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు

గ్రంథాలయాధికారి రమాదేవి



వి లవ్ రీడింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గ్రంథాలయాధికారి కె.రమాదేవి అన్నారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ తరగతి పుస్తకాలతో పాటు నీతి కథలు, మహనీయుల ఆత్మకథల పుస్తకాలు చదవాలని సూచించారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వి లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పుస్తకాలు చదివారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారానే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా ఎదిగారన్నారు. భారత రాజ్యాంగ రచనకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడిందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమానికి తల్లిదండ్రులు తమ పిల్లలు హాజరయ్యేలా చూడాలన్నారు. వారి వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డి.రమేష్, జి.ఝాన్సీ, సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘమాసం, ఆదివారం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సూర్యభగవానుడి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలని కాంక్షిస్తూ అమ్మవారి సన్నిధిలో ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న పలువురు ఉభయదాతలకు ప్రత్యేక క్యూ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గన్నవరం కన్వీనర్ నియామకం

గన్నవరం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గన్నవరం నియోజకవర్గం, నాలుగు మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా మెండె సుధాకర్‌ను, కో–కన్వీనర్లుగా కొల్లి సుబ్రమణ్యం, రాచప్రోలు అశోక్‌కుమార్, మన్నేపల్లి నరేష్, బండ్లమూడి ఆంజనేయప్రసాద్ నియమితులయ్యారు. గన్నవరం మండల కన్వీనర్‌గా పల్లి వీరయ్య, ఉంగుటూరు మండల కన్వీనర్‌గా తమలం సునీల్‌కుమార్, బాపులపాడు మండల కన్వీనర్‌గా ఎస్. శరత్‌బాబు, రూరల్ మండల కన్వీనర్‌గా పెనుమాక రాజేష్ ను నియమించారు.

గన్నవరం రూరల్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా ముస్తాబాదకు చెందిన పల్లి వీరయ్య, కో–కన్వీనర్‌గా బండారుపల్లి కోటేశ్వరరావు నియమితులయ్యారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శివాయలం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషంగా స్పందన లభించింది. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చిన్నం ఆదినారాయణ, పిచ్చేశ్వరరావులు మాట్లాడుతూ.. శిబిరంలో గ్యాస్ట్రబుల్, అజీర్తి, కడుపు నొప్పి, మలబద్ధకం, జీర్ణకోశ వ్యాధులకు, చెవి ముక్కు గొంతు, సుగరు, బీపీ తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించారన్నారు. శిబిరంలో వైద్యులు సూరె పవన్‌కుమార్, మానస కాజ, సర్య శరణ్ కుమార్ సంపనలు పాల్గొని 100 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు చేశారని చెప్పారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య, విజయదుర్గ పాలి క్లినిక్ అధినేత యండూరి వెంకట భవాని గుప్తా, సిబ్బంది సురేష్, గీత పాల్గొన్నారు.

కాటన్ దుస్తులు ధరించాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రబొట్ల ఆదిత్య

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలని ఎండలో తిరగకూడదని తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చంద్రబొట్ల ఆదిత్య సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స తీసుకునేదానికన్నా రాకుండా చూసుకోవడం మంచిదన్నారు. ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ తాము వృద్ధులకు ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్య నిపుణలతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. అలాగే ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్న వృద్ధులకు కార్పొరేటర్ శర్వాణీమూర్తి సహకారంతో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హోమియో వైద్యనిపుణులు డాక్టర్ రామబ్రహ్మం హోమియో వైద్యసేవలు గురించి వివరించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు నీలు సతీష్, కె.మధుసూదనరావు, ఎస్ఎన్ వరప్రసాద్, లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

జ్వరాలు సోకడంతో వైద్యశాఖ ప్రత్యేక దృష్టి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ పాలిటిక్నిక్ హాస్టల్‌లోని విద్యార్థులకు జ్వరాలు సోకడంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందులో భాగంగా ఆ ప్రాంతానికి చెందిన లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి, నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో ఎనిమిది మంది టైఫాయిడ్, ఒకరు డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో డెంగీ లార్వాను గుర్తించేందుకు జల్లెడ పట్టారు. నిల్వ నీటిని గుర్తించి, వాటిలోని లార్వాను నిర్వీర్యం చేశారు. లార్వా నాశన మందులు చల్లి, ఫాగింగ్ చేశారు. లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మెబీనా తన సిబ్బందితో అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరబాధితులకు చికిత్స చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని పిలిపించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరికీ జ్వర నిర్ధారణ పరీక్షలు చేశామని, ఒకరికి డెంగీగా నిర్ధారణ కావడంతో అప్రమత్తమైనట్లు తెలిపారు. ఇక్కడే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయక్, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల హక్కుల సాధనకుఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం వర్కింగ్ ఉమెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. పలువురు నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవాసమితి పేదలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పాయకాపురంలో స్పందన సేవాసమితి తృతీయ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పరిపాలన చేస్తున్నారన్నారు. అదే విధంగా స్పందన సేవాసమితి కూడా దివ్యాంగులకు, వృద్ధులకు, విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా సేవలందిస్తూ, భరోసా కల్పిస్తోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాలను అందజేయాలని ఎమ్మెల్యే సేవాసమితి నిర్వాహకులు కృష్ణప్రసాద్‌ను కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం 30 మంది విద్యార్థులకు పౌష్టికాహారం కిట్లు, ఇద్దరు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, 25 మంది వృద్ధులకు చీరలను ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యాలు నిత్యసత్యాలు



గుడివాడటౌన్: వేమన సాహిత్యాలు నిత్యసత్యాలు అని తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు వి.రాఘవాచార్యులు అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వేమన సాహిత్యం–సమాజంపై ప్రభావం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యం ఉన్నన్నాళ్ళు వేమన ప్రజల నాలుకలపై ఉంటారన్నారు. కులాల కుమ్ములాటలతో కునారిల్లుతున్న ఆ రోజుల్లో ఆ నాటి సమాజాన్ని మేలుకొలిపిన దిశాలి వేమన అన్నారు. కార్యక్రమంలో వై.కోటేశ్వరరావు, సాహితీ స్రవంతి గుడివాడ కార్యదర్శి జి.మాల్యాద్రి, సహాయ కార్యదర్శి ఎస్.శ్రీకుమార్, టి.నాగేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎస్వీ సుబ్రహ్మణ్యం, ఎన్ మురళీ కృష్ణారెడ్డి, ఎల్.సురేంద్ర పాల్గొన్నారు.